క్లుప్తంగా

అభివృద్ధిలో భాగస్వాములు కండి

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్



పనులను పరిశీలిస్తున్న దశరథ్‌నాయక్ తదితరులు

కడ్తాల్: ఎంపీడీఓ కార్యాలయ నిర్మాణ పనులను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ శనివారం పరిశీలించారు. పనులను వేగవంతంగా చేసి, త్వరలో అందుబాటులో తీసుకురావాలని గుత్తేదారుకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో రూ.50లక్షల వ్యయంతో ఎంపీడీవో కార్యాలయ భవనం, రూ.1.20 కోట్లతో తహసీల్దార్ కార్యాలయ భవనాలు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు రమేశ్, పాండు, జే పాండు తదితరులు ఉన్నారు.

పెద్దఅంబర్‌పేటకు త్రిపుర గవర్నర్



ఇంద్రసేనారెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేటలోని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు క్లైం బాల్‌రెడ్డి నివాసానికి శనివారం త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా బీజేపీ కార్యదర్శి గంటా ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది తిరుమల్‌రెడ్డి, స్థానిక బీజేపీ నాయకులు ఐలయ్యయాదవ్, రాంరెడ్డి, పాల్గొన్నారు.

ఎస్‌ఓటీ పోలీసుల దాడి

వ్యాపారిపై కేసు నమోదు

ఇబ్రహీంపట్నం రూరల్: అక్రమంగా గ్యాస్ సిలిండర్లు రీఫిల్లింగ్ చేస్తున్న కేంద్రంపై మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి.. సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఆదిబట్ల పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీనివాస్‌రావు కథనం ప్రకారం.. తుక్కుగూడ మున్సిపాలిటీ రావిర్యాలలో దామోదర్‌రెడ్డి అనే వ్యాపారి రీఫిల్లింగ్ చేస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

ఆలయాభివృద్ధికి కృషి



దేవేందర్‌గౌడ్, వీరేందర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

మహేశ్వరం: మాజీ హోంమంత్రి తూళ్ల దేవేందర్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్‌లను శనివారం అమీర్‌పేట్ శ్రీ గోదా సమేత పద్మావతి వేంకటేశ్వర స్వామి ఆలయ కార్యవర్గం కలిసి బ్రహ్మోత్సవాల జ్ఞాపికను అందజేసి సన్మానించారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షుడు జగదీష్ ముదిరాజ్ సభ్యులు బుచ్చిబాబు, భాస్కర్, శ్రీనివాస్, నారాయణ చారి, దర్శన్ గౌడ్, చంద్రయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సత్కరిస్తున్న సత్యంచారి, శ్రీనివాస్‌యాదవ్

హస్తినాపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను పరిష్కరించి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం శాసన సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం క్యాంపు కార్యాలయంలో ఆయనను హస్తినాపురం డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సత్యంచారి ఆధ్వర్యంలో కార్యకర్తలు శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని వరద ముంపు ప్రాంతాల్లోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కోట్లాది రూపాయలతో బాక్స్ డ్రెయిన్లు నిర్మించి సమస్యను పరిష్కరించామన్నారు. భవిష్యత్‌లో సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు.

రావమ్మా ‘మహాలక్ష్మి’

- ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు
- రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతల వెల్లువ



ఇబ్రహీంపట్నంలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రారంభించిన అధికారులు



ఆమనగల్లులో ఆర్టీసీ బస్సులో ఆధార్‌కార్డు చూపుతున్న మహిళలు

ఇబ్రహీంపట్నం/ ఆమనగల్లు: ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమల్లోకి తెస్తోంది. ఆరు గ్యారంటీల్లో ఒక్కటైన మహాలక్ష్మి పథకం కింద టీఎస్‌ఆర్టీసీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో తెలంగాణలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి తెచ్చింది. ఏఐసీసీ నేత సోనియాగాంధీ పుట్టిన రోజు సందర్భంగా శనివారం ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. మధ్యాహ్నం 1.30 గంటలకు అసెంబ్లీ వద్ద పచ్చజెండా ఊపి పథకాన్ని ప్రారంభించారు. ఆమనగల్లు పట్టణంలోని మధ్యాహ్నం 2 గంటలకు మహిళలు ఉచితంగా ప్రయాణించారు. ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించడంతో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిను అభినందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలుపుకుందని పలువురు ప్రశంసించారు.

కాంగ్రెస్ నేతల సంబురాలు

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ప్రభుత్వం ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం సంబురాలు జరుపుకున్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో బాణసంచా కాల్చి... మహిళా ప్రయాణికులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు ఎంపీపీ అనిత, జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు లక్ష్మీ కృష్ణనాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్య, నాయకులు శ్రీశైలం, సురేశ్ నాయక్, శ్రీకాంత్, నాసర్, ఫరీద్, బాబా, కరీం, హరిలాల్, మైసయ్య, శేఖర్, మహేశ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

హయత్‌నగర్: ఉచిత బస్సు సౌకర్యం మహిళలకు ఎంతో ఉపయోగకరమని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని హయత్‌నగర్ ఆర్టీసీ బస్ డిపో మేనేజర్ జలగం విజయ్, హయత్‌నగర్ పోలీసు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. ఈ పథకాన్ని శనివారం హయత్‌నగర్ బస్‌స్టేషన్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో ప్రయాణికులకు స్మార్ట్ కార్డులను అందజేస్తామని, అప్పటివరకు గుర్తింపు కార్డులను ప్రయాణికులు దగ్గర ఉంచుకోవాలని సూచించారు.

మహిళల హర్షం

కడ్తాల్: ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ ఉచిత ప్రయాణం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

బస్ సర్వీసుల సంఖ్య పెంచాల్సిందే

మహాలక్ష్మి పథకంతో ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించే వారి సంఖ్య తగ్గుతుంది. దీంతో బస్సుల్లో మహిళల రద్దీ పెరిగే అవకాశం ఉంది. కాబట్టి బస్సుల సంఖ్యను పెంచే ఆలోచనలో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోకు మహిళల ఉచిత ప్రయాణంతో ప్రతి రోజు రూ. 5.5 లక్షల ఆదాయం తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు.

సంతోషంగా ఉంది



ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించడం సంతోషంగా ఉంది. అచ్చంపేటకు ఆధార్‌కార్డు చూపించి ఉచితంగా ప్రయాణిస్తున్నాను. ఎన్నికల ముందు ప్రకటించిన హామీలను అమలు చేశారు. అలాగే వంట గ్యాస్ సిలిండర్‌ను రూ.500కు అందించాలి.

– సుజాత, అచ్చంపేట

ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం



ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. మహిళలకు ప్రాధాన్యతను ఇస్తూ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించారు. సంస్థ సిబ్బంది, అధికారులు ఈ పథకాన్ని విజయవంతం చేసేందుకు కృషిచేస్తాం. ఈ స్కీంతో సుమారు 40 నుంచి 45 శాతం ఆదాయం తగ్గే అవకాశం ఉంది. అయితే ప్రభుత్వం అండగా నిలవడంతో సంస్థకు మంచి భవిష్యత్తు ఉండబోతుంది.

– వెంకటనర్సప్ప, ఆర్టీసీ డిపో మేనేజర్, ఇబ్రహీంపట్నం

సంతోషంగా ఉంది



మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ఎంతో సంతోషంగా ఉంది. ఇబ్రహీంపట్నం సమీపంలోని జీఎన్‌ఐటీలో ఎంబీఏ చదువుతున్నాను. బస్సు పాసు భారం తగ్గుతుంది.

– మాధురి, జీఎన్‌ఐటీ, ఇబ్రహీంపట్నం

పేదలకు ఎంతో ఉపయోగం



ఈ పథకం పేదలకు ఎంతో ఉపయోగం. ఆరుట్ల నుంచి ఇబ్రహీంపట్నం వచ్చిపోవాలంటే రూ.60 కావాలి. నాకు ఆరోగ్యం బాగలేక ఇబ్రహీంపట్నం ఆస్పత్రికి బస్సు చార్జీ పెట్టుకొని వచ్చా. ఇప్పుడు ఇంటి వెళ్లేందుకు బస్సు చార్జీ బాధ తప్పింది.

– రాములమ్మ, ఆరుట్ల

మల్‌రెడ్డికి శుభాకాంక్షలు



రంగారెడ్డి బొకేలు అందజేస్తున్న నాయకులు

తుర్కయంజాల్: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని తొర్రూర్‌లోని ఆయన నివాసంలో బుధవారం పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కమ్మగూడకు చెందిన రాగ్యానాయక్, రాజు నాయక్, దేశ్యా నాయక్, మోహన్ నాయక్ తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మల్‌రెడ్డిని కలిసిన జయమ్మ

మంచాల: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జయమ్మ శనివారం కలిశారు. ఈ సందర్భంగా రంగారెడ్డిని ఆమె సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లేశ్, శ్రీధర్ నాయక్, ఎల్లమ్మ తండా సర్పంచ్ పద్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.



రంగారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జయమ్మ తదితరులు

కసిరెడ్డికి అభినందనల వెల్లువ



నారాయణరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఆమనగల్లు: కల్వకుర్తి శాసనసభ్యుడిగా కసిరెడ్డి నారాయణరెడ్డి శనివారం అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేశారు. ఎమ్మెల్యేగా కసిరెడ్డి నారాయణరెడ్డి చేత ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం అక్బరుద్దీన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

నారాయణరెడ్డి శుభాకాంక్షల వెల్లువ

మాడ్గుల: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. మాడ్గుల మండలానికి చెందిన కేఎస్‌ఆర్ యువసేన నాయకులు కసిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో రమేశ్‌గౌడ్, శివ, విజయ్, నరేశ్, వరుణ్, బాబా తదితరులు పాల్గొన్నారు.

కసిరెడ్డికి సన్మానం

కడ్తాల్: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి శుభాకాంక్షలు వెల్లువెత్తున్నాయి. శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మండల కేంద్రానికి పలువురు కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, హన్మానాయక్, శ్రీకాంత్‌రెడ్డి, నరేశ్ నాయక్, రాజేందర్‌గౌడ్, అశోక్ తదితరులు ఉన్నారు.

మొక్కు తీర్చుకున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: ఎమ్మెల్యేగా కసిరెడ్డి నారాయణరెడ్డి విజయం సాధించడంతో తలకొండపల్లి మండలం గట్టుప్పలపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేణురెడ్డి, దామోదర్, రఘురాములు, కిషన్, అంజయ్య, పవన్, పాపిరెడ్డి, మల్లేశ్, శ్రీశైలం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



ఇబ్రహీంపట్నం: సోనియాగాంధీ జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ శ్రేణులు



ఆమనగల్లు: కేకు కట్ చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ అనిత

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నేతలు సోనియాగాంధీ చిత్రపటం ఎదుట కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు, కౌన్సిలర్ మమత, శ్రీకాంత్, సుబ్బూరి పాండు, మల్లిక, రాములు, గౌస్, రవి, మహేశ్ పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆమనగల్లు పట్టణంలోని జాతీయ రహదారిపై రాజీవ్ చౌరస్తా వద్ద సోనియా చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు ఎంపీపీ అనిత, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్య, మాజీ అధ్యక్షుడు రాములు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

లార్డ్స్ పాఠశాలలో హరితహారం



మొక్క నాటుతున్న బీరప్ప తదితరులు

మీర్‌పేట: ప్రతి పౌరుడు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించుకోవాలని లార్డ్స్ విద్యాసంస్థల చైర్మన్, కార్పొరేటర్ సిద్దాల బీరప్ప కోరారు. శనివారం జిల్లెలగూడ లార్డ్స్ హైస్కూల్‌లో నిర్వహించిన హరితహారం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, కళాశాల సిబ్బందితో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. చెట్ల ప్రాముఖ్యత, మొక్కలు నాటడం వల్ల కలిగే ఉపయోగాలపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ‘చేయి చేయి కలుపుదాం.. చెట్లను నాటుదాం.. భావితరానికి స్వచ్ఛమైన గాలి, పచ్చదనాన్ని అందించాలని’ విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో డీన్ సతీష్‌కుమార్, డైరెక్టర్ సిద్దాల శ్రీలత, ప్రిన్సిపాల్ సరిత పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదుకోవాలి

సంఘం నాయకుడు మల్లికార్జున్



మాట్లాడుతున్న దివ్యాంగుల సంఘం నాయకుడు మల్లికార్జున్

ఆమనగల్లు: రాష్ట్ర ప్రభుత్వం మహిళలతో పాటు దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని రాష్ట్ర దివ్యాంగుల సంఘం నాయకుడు మల్లికార్జున్ డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి దివ్యాంగురాలికి తొలి సంతకంతో ఉద్యోగం ఇవ్వడం మంచి పరిణామని పేర్కొన్నారు. అయితే కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగం ఇచ్చారని విమర్శించారు. తాము ఆర్థికంగా సామాజికంగా వెనుకబడి ఉన్నామని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం అమలు చేసే పథకాలలో దివ్యాంగులకు ఐదు శాతం పథకాలు కేటాయించాలని, బడ్జెట్‌లో నాలుగు శాతం నిధులు కేటాయించాలని మల్లికార్జున్ డిమాండ్ చేశారు. సమావేశంలో దివ్యాంగుల సంఘం నాయకులు చెన్నకేశవులు, శ్రీశైలం, రమేశ్, గిరిగౌడ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్యారంటీల అమలు అభినందనీయం



ఎమ్మెల్యే రంగారెడ్డిని కలిసిన అరవింద్‌కుమార్ తదితరులు

హుడాకాంప్లెక్స్: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా గెలుపొందిన మల్‌రెడ్డి రంగారెడ్డిని శనివారం సరూర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆకుల అరవింద్‌కుమార్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ.. ఏఐసీసీ నేత సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా ఆరు గ్యారంటీలలో రెండింటినీ అమలు చేయడం అభినందనీయమన్నారు. త్వరలో గ్యారంటీలను అమలు చేస్తారని తెలిపారు. ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన మల్‌రెడ్డికి త్వరలోనే మంత్రి పదవి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ పూజలు



అన్మాస్‌పల్లి హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కడ్తాల్: మండల పరిధిలోని అన్మాస్‌పల్లి వీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం నేనావత్ జాన్యనాయక్ హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి ఫల పంచామృత అభిషేకం, అలంకరణ, పత్రిపూజ, హనుమాన్ చాలీసా పారాయణం, సత్యనారాయణ స్వామి వ్రతం, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు చేశారు. అనంతరం భక్తులకు జాన్యనాయక్ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు సుధీర్‌రెడ్డి, పాండునాయక్, కృష్ణయ్య, నాగార్జున్, కృష్ణయ్య, పర్వతాలు, సేవ్యా, శ్రీరాములు, నర్సింహాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కోలుకోవాలని పూజలు



మహేశ్వరం: ఆలయం ఎదుట బీఆర్‌ఎస్ నాయకులు

మీర్‌పేట: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరగా కోలుకోవాలని మీర్‌పేట కార్పొరేషన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం జిల్లెలగూడలోని కట్టమైసమ్మ ఆలయంలో స్థానిక నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. కేసీఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. పూజల్లో ఫ్లోర్‌లీడర్ భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు గౌరీశంకర్, బాలమణి, నాయకులు దీప్‌లాల్‌చౌహాన్, ప్రభాకర్‌రెడ్డి, దయానంద్ ముదిరాజ్, గోపీయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శివగంగా రాజరాజేశ్వర ఆలయంలో

మహేశ్వరం: మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే సబితారెడ్డి ఆదేశానుసారం బీఆర్‌ఎస్ నాయకులు మహేశ్వరం శివగంగా రాజరాజేశ్వర ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రతిపక్ష నేతగా కేసీఆర్ సేవలందించాలని భగవంతుని వేడుకున్నట్లు ఆలయ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్ గౌడ్ తెలిపారు.

చెత్త తరలింపుపై నిర్లక్ష్యం

- డంపింగ్ యార్డులుగా మారుతున్న కాలనీ రోడ్లు
- దుర్వాసనతో స్థానికులు వాహనదారుల ఇక్కట్లు



సాహెబ్‌నగర్ శ్మశాన వాటిక సమీపంలోని రోడ్డుకు అడ్డంగా పేరుకుపోయిన చెత్త

ఎల్‌బీనగర్: అధికారుల నిర్లక్ష్యం కారణంగా కాలనీలు చెత్త డంపింగ్ యార్డులుగా మారుతున్నాయి. ఫలితంగా ఆయా కాలనీల ప్రజలతో పాటు వాహనదారులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. రోజు వారీగా చెత్తను తరలించకపోవడంతో సాహెబ్‌నగర్ శ్మశానవాటిక వద్ద రోడ్డు చెత్త డంపింగ్ యార్డుగా మారింది. అధికారులు వివిధ కాలనీల నుంచి రోజూ డంపింగ్ చేస్తున్న చెత్తను అక్కడ నుంచి తొలగించకపోవడంతో ప్రజలు అటు వైపు వెళ్లలేక పోతున్నారు. చెత్త నుంచి వస్తున్న కంపుతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

కాలనీలు చెత్త డంపింగ్ యార్డా?

ప్రతి రోజూ రోడ్లు ఊడ్చగా వచ్చిన చెత్తతోపాటు ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో ఏర్పాటు చేసిన చెత్త డంపింగ్ పాయింట్ వద్ద చెత్తను చేర్చాలి. అక్కడ నుంచి భారీ వాహనాల్లో వేరే ప్రాంతానికి తరలిస్తారు. కానీ ఇక్కడ ఏకంగా కాలనీలోకి వెళ్లే రహదారుల పక్కనే చెత్త డంపింగ్ యార్డుగా మార్చారు. ఈ డంపింగ్ యార్డు నుంచి వస్తున్న దుర్వాసన భరించలేక పరిసర ఇళ్ల యజమానులతో పాటు కాలనీలకు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను రోజు వారీగా తరలించాలని కోరుతున్నారు.